క్లుప్తంగా

ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారిగా సురేఖ



కలెక్టర్ కృతికా శుక్లాను కలిసిన డాక్టర్ సురేఖ

కాకినాడ సిటీ: పెద్దాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సురేఖ బోడవుల కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయంలో జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారిగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగవద్దు

కాకినాడ లీగల్: బహిరంగ ప్రదేశాల్లో గొడవలు, కొట్లాటలు, మద్యం తాగేవారిపై చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ,పెద్దాదపురం సబ్ డివిజన్ పోలీసు స్టేషన్ ప్రాంతాల్లో మద్యం తాగి హహనాలు నడిపేవారిపై, బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే వారిపై, గొడవలు, కొట్లాటలు, భౌతిక దాడులకు పాల్పడినా ఏ మాత్రం ఉపేక్షించేదిలేదన్నారు. వారం రోజులలో జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో ఇటువంటి వారు 280 మందికి కోర్టు జరిమానా, కొందరికి జైలు శిక్ష విధించినట్టు ఎస్పీ తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న ఈఓ పీఆర్డీ రామాంజనేయులు, ప్రసాద్

కాకినాడ రూరల్: మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ పరిపాలనపై శుక్రవారం ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈఓ పీఆర్డీ రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన శిక్షణలో స్టేట్ రిసోర్స్ పర్సన్, కొవ్వాడ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ శిక్షణ అందించారు. సర్పంచ్‌లు హాజరయ్యారు.

సౌత్‌వెస్ట్ జోన్ స్విమ్మింగ్‌కు సాయిధనుష్‌రాజ్



సాయిధనుష్‌రాజ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీకాంత్ తదితరులు

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్ 2023–24 సౌత్‌వెస్ట్ జోన్ స్విమ్మింగ్ జట్టుకు ఐడియల్ సీఎస్ఈ విద్యార్థి పి.సాయిధనుష్‌రాజ్ ఎంపికయ్యాడు. జనవరి మొదటి వారంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహించే టోర్నమెంట్‌కు అతడు అర్హత సాధించాడు. అలాగే డిసెంబర్ 17న నరసారావుపేటలో నిర్వహించే పోటీలకు కాకినాడ జిల్లా అక్వాటిక్ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపి సౌత్‌జోన్‌కు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా సాయిధనుష్‌రాజ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్, చైర్మన్ కృష్ణారావు, కరస్పాండెంట్ చిరంజీవినీ కుమారి అభినందించారు.

అట్రాసిటీ కేసు బాధితులకు ఇంటి స్థలం మంజూరు

కాకినాడ సిటీ: ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులో బాధిత కుటుంబానికి ఆర్డీఓ ఈట్ల కిశోర్ శుక్రవారం జగనన్న కాలనీలో ఇంటి స్థలం పట్టా మంజూరు చేసి అందజేశారు. 2018లో కరప మండలం గురజనాపల్లికి చెందిన రాముల మల్లీశ్వరి జగన్నాధపురం మార్కెట్ వీధిలో జరిగిన రెండు వర్గాల దాడిలో మరణించింది. అప్పట్లో అట్రాసిటీ కేసు నమోదైంది. అయినప్పటికీ బాధితులకు న్యాయం జరగకపోవడంతో సమస్యను ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరీ కమిటీ డివిజన్ సమావేశంలో సభ్యుడు డోకుబుర్ర భద్రం ఆర్డీవో ఈట్ల కిశోర్‌కు వివరించారు. దీంతో మల్లీశ్వరి కుమార్తె చిన్నారికి నేమాం గ్రామంలో జగనన్న కాలనీలో ఈ పట్టాను తన కార్యాలయంలో ఆర్డీవో అందజేశారు. అలాగే ప్రభుత్వ సాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆర్డీఓను దళిత గిరిజన బీసీ ముస్లిం క్రైస్తవ ఐక్యవేదిక నాయకులు అభినందించారు. కార్యక్రమంలో డోకుబుర్ర భద్రం, సిద్ధాంతపు రాజు, ఐక్యవేదిక సభ్యుడు నందికి వీరబాబు, మల్లీశ్వరి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైద్య పోస్టులకు నోటిఫికేషన్

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నేషనల్ హెల్త్ మిషన్‌లో మెడికల్ ఆఫీసర్, ఇతర పారా మెడికల్‌కు సంబంధించి 76 పోస్టులకు శుక్రవారం డీఎంహెచ్‌ఓ జె.నరసింహానాయక్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. దరఖాస్తులను స్థానిక డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తారన్నారు. సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు నమూనా పొందుపరచినట్లు డీఎంఅండ్‌హెచ్‌వో వివరించారు.

అమ్మకు పరీక్ష.. బిడ్డకు రక్ష

- పేద గర్భిణులకు వరం పీఎంఎస్ఎంఏ
- ప్రతి నెల 9న ఆసుపత్రుల్లో ఉచిత వైద్య పరీక్షలు



ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమానికి గర్భిణులను తీసుకెళ్తున్న వైద్య సిబ్బంది

కాకినాడ సిటీ: బిడ్డకు జన్మనివ్వడం అంటే ఆ తల్లికి మరో జన్మ ఎత్తినట్టే. కాన్పు ఎంత కష్టమో ఈ ఒక్కమాట చెబుతుంది. పేద మహిళలు సకాలంలో వైద్యం అందక ప్రసవ సమయంలో ఊపిరి వదిలేసిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇకపై ఇలా జరగకూడదని, తల్లీ బిడ్డా క్షేమంగా ఉండాలని భావించిన కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌ను(పీఎంఎస్ఎంఏ) అమల్లోకి తీసుకువచ్చింది. ఈ పథకం కింద ప్రతినెలా తొమ్మిదో తేదీన గర్భిణులను పీహెచ్‌సీల్లో పరీక్షించి ఉచితంగా మందులిస్తారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని మూడు పీహెచ్‌సీలు, కాకినాడ అర్బన్ పరిధిలో 13 యూపీహెచ్‌సీల్లో ఈ సేవలు అందుతున్నాయి. గర్భిణులు పరీక్షల విషయాలు మరచినా సంబంధిత అధికారులు, సిబ్బంది గుర్తు చేసి, అవసరమైతే దగ్గరుండి సేవలు అందిస్తున్నారు.

వైద్యం, మందులూ ఉచితం

పరీక్షల్లో భాగంగా గర్భిణులకు హిమోగ్లోబిన్, బీపీ, బరువు, ఎత్తు, హెచ్ఐవీ తనిఖీలు చేస్తారు. వైద్య పరీక్షల అనంతరం కాన్పు కష్టం అయ్యే పరిస్థితి ఉంటే 108, 102 వాహనాల్లో వారిని తీసుకువెళ్లి స్కానింగ్ సహా అన్ని పరీక్షలు సిబ్బందే చేయిస్తున్నారు. ఈ పరీక్షలకు ప్రయాణ ఖర్చులు ఉచితం. 108 వాహనంలో ఆయా గ్రామాల నుంచి సీహెచ్‌సీ, పీహెచ్‌సీలకు తీసుకొస్తారు. తిరిగి గ్రామాలకు తీసుకెళ్తారు. కేంద్రం అమలు చేస్తున్న ఈ పథకం వల్ల చాలా ప్రయోజనాలున్నా ప్రతి పీహెచ్‌సీలో స్కానింగ్ యంత్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

వేధిస్తున్న రక్తహీనత

అమ్మ ఆరోగ్యంగా ఉన్నప్పుడే పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుంది. శాస్త్ర విజ్ఞానం ఎంతగా విస్తరిస్తున్నా పోషకాహార లోపంతో నేటికీ అధిక శాతం మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు. ఏడాదికి కాకినాడ డివిజన్‌లో 350 నుంచి 500 మంది వరకు గర్భిణులు రక్తహీనతతో బాధపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఆసుపత్రుల్లోనే ప్రసవించాలి



ప్రతి మహిళ ఆసుపత్రుల్లోనే ప్రసవించాలి. ప్రతి పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటు ఉండేలా చర్యలు తీసుకున్నాం. వైఎస్సార్ ఆరోగ్య సేవలు అందుబాటులోకి వచ్చాక అన్ని ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత లేకుండా సిబ్బందిని నియమించాం. ప్రతి గర్భిణి తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకునేలా గ్రామీణ స్థాయిలో వైద్యం అందిస్తున్నాం.

– జె. నరసింహనాయక్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి

గర్భిణులకు ప్రయోజనం



మాతా శిశు మరణాలు తగ్గించే ఉద్దేశంతో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ ద్వారా వైద్య సేవలు ఉచితంగా అందజేస్తున్నాం. మహిళలకు అవసరమైన రక్త, ఇతర పరీక్షలతో పాటు రెండు సార్లు స్కానింగ్ చేస్తున్నాం. ఇబ్బంది ఉన్న గర్భిణులను గుర్తించి వారికి అవసరమైన సలహాలు, సూచనలు, మందులు వాడేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీనివాసనాయక్, మండల వైద్యాధికారి, కరప

విశ్వభాషగా హిందీ

- సెంట్రల్ వర్సిటీ ప్రొఫెసర్ సత్రాజు
- ముగిసిన హిందీ జాతీయ సదస్సు



సదస్సు కన్వీనర్ హరిరామప్రసాద్‌ను సత్కరిస్తున్న అధికారులు

బాలాజీచెరువు: విశ్వభాషగా హిందీ అవతరిస్తుందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సత్రాజు పేర్కొన్నారు. పీఆర్ డిగ్రీ కళాశాలలో హిందీ, ఇంగ్లిష్ విభాగం, కేంద్రీయ హిందీయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన హిందీ జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ప్రొఫెసర్ సత్రాజు మాట్లాడుతూ హిందీ జాతీయ భాష అయినప్పటికీ రానున్న రోజుల్లో విశ్వభాషగా అవతరించి, ప్రజలు ప్రపంచ దేశాల్లో తమ వ్యాపార లావాదేవీల నిర్వహణకు మన దేశంలో హిందీ నేర్చుకుంటున్నారన్నారు. చైనాలో జాతీయ భాష అయిన మాండరిన్ తర్వాత హిందీ నేర్చుకుని గ్లోబల్ మార్కెట్‌లో మంచి ఫలితాలు సాధిస్తున్నారన్నారు. సదస్సులో భాగంగా 50 మంది అధ్యాపకులు పరిశోధన పత్రాలు సమర్పించారు. సదస్సు కన్వీనర్ హరిరామప్రసాద్, ప్రిన్సిపాల్ తిరుపాణ్యంలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు, అధ్యాపకులు నాగేశ్వరరావు, గౌతమ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అమ్మ ఆశీస్సులతో మహాశక్తి యాగం

- శ్రీపీఠంలో దిగ్విజయంగా 25వ రోజుకు కుంకుమార్చనలు
- 88 కోట్ల కుంకుమార్చనలు పూర్తి
- పరిపూర్ణానంద స్వామీజీ వెల్లడి



భక్తులు తీసుకువచ్చిన పుష్పాలతో అర్చన అనంతరం లలితా అమ్మవారు



శ్రీపీఠంలో లలితా కుంకుమార్చనల్లో వేలాదిగా పాల్గొన్న భక్తులు

కాకినాడ రూరల్: ఐశ్వర్యాంబిక సమేత సుందరేశ్వరస్వామి అనుగ్రహం.. లలితా అమ్మవారి ఆశీస్సులతో మహాశక్తి యాగం దిగ్విజయంగా సాగుతోందని శ్రీపీఠం స్వామిజీ పరిపూర్ణానంద తెలియజేశారు. కార్తికమాసం చివరి శుక్రవారం యాగ ప్రాంగణం భక్తులతో నిండిపోయింది. సుమారు 30వేల మంది భక్తులు హాజరైనట్టు అంచనా. ఇప్పటికి 88 కోట్ల కుంకుమార్చనలు పూర్తయ్యాయని స్వామీజీ ప్రకటించారు. మంగళవారం శ్రీపీఠంలో ఆంజనేయ స్వామికి అరటి పండ్లతో అభిషేకం చేస్తామని, బుధవారం యాగం ముగింపు రోజున పూర్ణాహుతిలో భక్తులు వండి తీసుకువచ్చే బూరెలను నైవేద్యంగా నివేదిస్తామన్నారు. సాయంత్రం ఉత్సవ మూర్తులు శివ పార్వతుల ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం కోటి దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. రాత్రి బగళాముఖి హోమం నిర్వహించారు. పలువురు భక్తులు శుక్రవారం ఉదయం చిత్తా నక్షత్ర శాంతులు చేయించుకున్నారు. భక్తులకు రాంభట్ల నృసింహ శర్మ, పుష్పగిరి స్వామిజీ అనుగ్రహ భాషణం చేశారు.

నియోజకవర్గానికి ఆధ్యాత్మిక శోభ : ఎమ్మెల్యే కురసాల

శ్రీపీఠం వేదికగా జరుగుతున్న మహాశక్తియాగంలో మహిళా మాతృమూర్తులు వేలాదిగా వచ్చి పాల్గొనడంతో ఈ నియోజకవర్గానికి ఆధ్యాత్మిక శోభ వచ్చిందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. ఇందుకు పరిపూర్ణానంద స్వామి అభినందనీయులని ఆయన ప్రశంసించారు. శుక్రవారం లలితా కుంకుమార్చనలలో ఎమ్మెల్యే కన్నబాబు కుటుంబ సభ్యులతో హాజరై లలితా, బగళాముఖి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వేలాదిగా వచ్చిన భక్తులకు కల్పిస్తున్న అన్న ప్రసాద సదుపాయం గురించి స్వామీజీ వంటశాల, భోజన శాల వద్దకు ఎమ్మెల్యేను తీసుకువెళ్లి వివరించారు.

విద్యార్థుల ఇంటర్న్‌షిప్‌కు సంస్థలను కేటాయించండి

- కలెక్టర్ కృతికా శుక్లా
- స్కిల్ డెవలప్‌మెంట్‌పై అధికారులకు ఆదేశం

కాకినాడ సిటీ: జిల్లాలోని డిగ్రీ, ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఆరు నెలల ఇంటర్న్‌షిప్ పూర్తి చేసేందుకు విద్యార్థులను సంబంధిత ప్రభుత్వ శాఖలకు, ప్రైవేట్ సంస్థలకు కేటాయించాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంపై వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో జేఎన్‌టీయూ, నన్నయ వర్సిటీ పరిధిలో ఉన్న కళాశాలల్లో డిగ్రీ, ఇంజినీరింగ్ చదువుతున్న ఫైనల్ ఇయర్ విద్యార్థులకు జనవరి 2024 నుంచి ఆరు మాసాలు శిక్షణ పూర్తి చేసేందుకు వారి విద్యకు సంబంధించిన ప్రభుత్వ శాఖలకు, ప్రైవేట్ సంస్థలకు విద్యార్థులను కేటాయించాలని కలెక్టర్ ఆదేశించారు. ఏ కళాశాల విద్యార్థిని ఏ శాఖకు, ఏ సంస్థకు కేటాయించారో వాటి వివరాలను పూర్తి స్థాయిలో అందజేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో జేఎన్‌టీయూకేకు అనుబంధంగా ఉన్న కళాశాలలో 6,338 మంది విద్యార్థులు, నన్నయ వర్సిటీ పరిధిలో 9,054 మంది విద్యార్థులు మొత్తం 15,392 మంది విద్యార్థులు ఇంటర్న్‌షిప్ విజయవంతంగా పూర్తి చేసేందుకు 50 శాతం మంది ప్రభుత్వ సంస్థల్లోను, 50 శాతం ప్రైవేట్ సంస్థల్లోనూ కేటాయించాలని, అదే సమయంలో విద్యార్థులను అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో వికాస పీడీ కె.లచ్చారావు, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఆదిశేషు, జెడ్పీ సీఈవో ఎ వెంకటరమణారెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌వో జె నరసింహ నాయక్, వ్యవసాయశాఖ జేడీ ఎస్.విజయకుమార్, సాంఘిక సంక్షేమశాఖ జేడీ రమణమూర్తి, పశుసంవర్థక శాఖాధికారి సూర్యప్రకాశరావు, సీపీవో త్రినాథ్, ఐసీడీఎస్ పీడీ ప్రవీణ, నన్నయ వర్సిటీ ప్రిన్సిపాల్ సాయిప్రసన్న, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి కావాలంటే జగనే రావాలి

- ఎంపీపీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సుబ్బారావు
- ఉప్పలంకలో వై ఏపీ నీడ్స్ జగన్



ఉప్పలంకలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీఎస్ మండల కన్వీనర్ గీసాల శ్రీనివాసరావు

కరప: సంక్షేమ పథకాలు మరింతగా అమలుచేయాలన్నా, రాష్ట్రాభివృద్ధి జరగాలన్నా జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలుపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు పేర్కొన్నారు. మండలం ఉప్పలంకలో శుక్రవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో వారు మాట్లాడారు. నవరత్నాలు, సంక్షేమ పథకాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజలతో మమేకమై పనిచేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబును వచ్చేఎన్నికల్లో గెలిపించి, తద్వారా జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. గ్రామ సచివాలయం వద్ద అధికారులతో కలసి ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డ్‌ను ఆవిష్కరించారు. మండల ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ సచివాలయం పరిధిలో ప్రభుత్వం అందిస్తున్న సేవలు, సంక్షేమ పథకాలను వివరించారు. డీబీటీ, నాన్ డీబీటీ తదితర కార్యక్రమాల ద్వారా రూ.19.94కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపి, గ్రామంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. అనంతరం గ్రామ కూడలిలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని నాయకులు ఆవిష్కరించారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, ఉప్పలంక గ్రామ కమిటీ అధ్యక్షులు బొమ్మిడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రమణయ్యపేటలో వై ఏపీ నీడ్స్ జగన్

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామ సచివాలయం – 5 ఈశ్వర్‌నగర్‌లో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఈఓ పీఆర్డీ రామాంజనేయులు, మండల జేసీఎస్ కన్వీనర్ గీసాల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గంజా సత్తిబాబు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా సుమారు రూ.16 కోట్లు పంపిణీ చేయడంతో వాటి వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ప్రదర్శించారు. సుమారు రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలియజేశారు. ఏపీ స్టేట్ శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టరు అనుసూరి ప్రభాకర్, నాని, మాచరపు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కమిటీల పర్యవేక్షణలో క్రీడలు

- ఎంపీడీఓ అప్పారావు



ఆడుదాం ఆంధ్ర, సంకల్పయాత్రలపై అవగాహన కల్పిస్తున్న ఈఓ పీఆర్డీ శ్రీనివాసరావు

కరప: గ్రామీణ ప్రాంతాల్లో యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ నెల 15వ తేదీ నుంచి జరిగే ఆడుదాం ఆంధ్ర పోటీలను గ్రామ, మండల స్థాయి కమిటీల పర్యవేక్షణలో నిర్వహించాలని ఎంపీడీఓ కె.అప్పారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో శుక్రవారం గ్రామ కార్యదర్శులు, సచివాలయ అసిస్టెంట్లు, వీఏఎలు, వివిధ శాఖల అధికారులు, పీడీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పోటీల నిర్వహణపై చర్చించి, పలు సూచనలు ఇచ్చారు. ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు ఆడుదాం ఆంధ్ర క్రీడల నిర్వహణపై అవగాహన కల్పించి, గ్రామ, మండలస్థాయి నిర్వాహక కమిటీలను ప్రకటించి, వారి విధులను వివరించారు. తర్వాత ఈ నెల 13 నుంచి నిర్వహించే వికసిత భారత సంకల్పయాత్ర గురించి వివరించి, చేయాల్సిన విధి, విధానాలపై అవగాహన కల్పించారు. తుపాను కారణంగా శనివారం నుంచి ప్రారంభించాల్సిన కులగణన సర్వే వాయిదా పడిందని, ఎప్పటి నుంచి నిర్వహించేది తెలయజేస్తామని ఈఓపీఆర్డీ తెలిపారు. ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ, మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, పంచాయతీరాజ్ ఏఈఈలు ఎ.వర్ధన్, ఎస్.రాంబాబు, జి.శైలజ పాల్గొన్నారు.

క్విజ్‌లతో జ్ఞాన విస్మృతి

- కలెక్టర్ కృతికా శుక్లా
- రిలయన్స్ క్విజ్ విజేతలకు బహుమతి ప్రదానం



విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌లు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జ్ఞాన విస్మృతితో పాటు, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే క్విజ్ పోటీలలో విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొనాలని కలెక్టర్ కృతికా శుక్లా కోరారు. ధీరూబాయి అంబానీ జయంతిని పురస్కరించుకుని రియలన్స్ ఇండస్ట్రీస్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవన్ ఆడిటోరియంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసింది. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 9, 10 తరగతులు చదువుతున్న సుమారు 600 మంది విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కలెక్టర్ కృతికా శుక్లా జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. సామాజిక సేవా దృక్పథంతో ఈ పోటీలు నిర్వహించి రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థను పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించిన ఉపాధ్యాయులను కలెక్టర్ అభినందించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన శ్రీనగర్ అడ్వాన్సు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు మహమ్మద్ జైనుల్ అభిదిన్, సమరీన్ ఫాతిమాలకు లాప్‌టాప్‌లను, రన్నర్స్‌గా నిలిచిన ఉండూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆర్.దేవిశ్రీ, ఆర్ సాత్విక్‌లకు టాబ్‌లను, మరో 5 పాఠశాలల విద్యార్థులకు సైకిళ్లను రిలయన్స్ సంస్థ సైట్ హెడ్ అక్షయ భక్షి, సీఎస్ఆర్ హెడ్ పోతాప్రగడ సుబ్రమణ్యం అందజేశారు.

సైనిక నిధిని పరిపుష్టం చేయండి

- కలెక్టర్ కృతికా శుక్లా
- గత ఏడాది విరాళాల సేకరణలో జిల్లాకు రెండోస్థానం
- గవర్నర్ చేతుల మీదుగా ట్రోఫీ ప్రదానం



జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాకు ట్రోఫీని అందజేస్తున్న కెప్టెన్ సత్యప్రసాద్

కాకినాడ సిటీ: వీర సైనికులు, వారి కుటుంబాల సంక్షేమ నిధికి ప్రజలు, వ్యాపార, వాణిజ్య పారిశ్రామిక సంస్థలు విరివిగా విరాళాలు అందించాలని కలెక్టర్ కృతికా శుక్లా కోరారు. 2022 సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రూ.46,83,533 విరాళాన్ని సేకరించి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. ఇందుకు ప్రశంసిస్తూ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ గురువారం రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన–2023 సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాకు ట్రోఫీని అందజేశారు. గవర్నర్ అందించిన ట్రోఫీని జిల్లా సైనిక సంక్షేమ బోర్డు చైర్‌పర్సన్, కలెక్టర్ కృతికా శుక్లా తరపున జిల్లా సైనిక సంక్షేమాధికారి కెప్టెన్ పి.సత్యప్రసాద్ స్వీకరించారు. తదుపరి శుక్రవారం ఆయన కలెక్టర్ కృతికా శుక్లాను ఆమె చాంబర్‌లో సత్యప్రసాద్ కలిసి ఈ ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ దేశ రక్షణలో ఎన్నో కష్టాలకు ఎదురొడ్డి, ధైర్య సాహసాలతో వీరోచిత సేవలను అందిస్తున్న సైనికులు, వారి కుటుంబాల సంక్షేమానికి కృతజ్ఞతా భావనతో భారీ విరాళాలు అందించిన ప్రజలకు, సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఈ సంవత్సరం కూడా విరివిగా విరాళాలు అందించి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని ఆమె ప్రజలను, సంస్థలను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు, సైనిక సంక్షేమశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వికాసలో 11న జాబ్‌మేళా

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో ఈనెల 11వ తేదీ సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం విలేకర్లకు తెలిపారు. ఈ జాబ్ మేళాలో టెక్ మహేంద్ర కంపెనీలో బీపీవో (తెలుగు, ఇంగ్లిషు), ఫ్లూయిన్‌టు కంపెనీలో బిజినెస్ డెవలప్‌మెంట్ అసోసియేట్, జియో ఫైబర్ నెట్‌లో హెచ్ఎస్‌వో, సంతోషిమాతా ప్యాకింగ్‌లో ట్రైనీ ఆపరేటర్స్ తదితర ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పీడీ వివరించారు. అదే విధంగా డీడీయూజీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారు. పై ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బీటెక్ అండ్ పీజీ ఉత్తీర్ణులైనన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ. 30 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులందరూ సోమవారం కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరుకావాలని పీడీ అన్నారు.

పంట నష్టాన్ని ప్రభుత్వానికి నివేదిస్తాం

- పలు గ్రామాల్లో అధికారులు, నాయకుల పర్యటన




కరప పుంత మార్గంలో వర్షానికి దెబ్బతిన్న ధాన్యం రాశులను ఆరపెట్టుకున్న అన్నదాతలు

కరప: మండల పరిధిలో మిచాంగ్ తుపాను నష్టాన్ని ప్రభుత్వానికి నివేదించి, పరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటామని అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు రైతులకు భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదేశాల మేరకు శుక్రవారం జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, సాదే లోహిదాస్, మద్దూరి భాస్కర్‌లు తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, కరప సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు, ఎంఏఓ ఏవీ రాజేష్, ఆర్ఐ పి.మాచర్రావు, వీఏఏ ప్రశాంత్‌లతో కల్సి కరప, వలసపాకల, పెనుగుదురు తదితర గ్రామాల్లో పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించారు.

యూబీఐ పథకాలను సద్వినియోగం చేసుకోండి

- రీజినల్ హెడ్ సాయి మనోహర్
- సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం



సమావేశంలో మాట్లాడుతున్న రీజినల్ హెడ్ సాయి మనోహర్

కాకినాడ సిటీ: కాకినాడ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ ఆఫీస్ ఆధ్వర్యంలో తిలక్ వీధి బ్రాంచ్‌లో ఔత్సాహిక ఎంఎస్ఎంఈ పారిశ్రామిక వేత్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ హెడ్ సాయి మనోహర్ హాజరై ఎంఎస్ఎంఈ పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి బ్యాంకు నుంచి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఉద్దేశించి రూపొందించిన ఆకర్షణీయమైన పథకాలను, ప్రభుత్వ పథకాలను ఎలా అందజేస్తున్నారో వివరించారు. అనంతరం అర్హులైన ఎంఎస్ఎంఈ ఖాతాదారులకు శాంక్షన్ లెటర్లను అందజేశారు. ఖాతాదారులందరికీ బ్యాంకు అందిస్తున్న వివిధ రకాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ బంధుమిత్రులను కూడా బ్యాంకుకు పరిచయం చేయాలని రీజనల్ హెడ్ కోరారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ క్రెడిట్, ఎంఎల్‌పీ హెడ్, లోకల్ బ్రాంచి మేనేజర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై రూసా సమీక్ష

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ఇంజినీరింగ్ కళాశాలలో రూసా నిధులతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను ఆ కమిటీ సభ్యులు శుక్రవారం సమీక్షించారు. పీజీ వసతి గృహం, కంప్యూటర్ ల్యాబ్ తదితర వాటిని పరిశీలించి త్వరితగతిన పనులు చేపట్టాలని కోరారు. కమిటీ సభ్యులు డాక్టర్ తులసీ మస్తానమ్మ, తిరుపతిరావు, అనంతలక్ష్మి, రమేష్, పి.నిత్యానంద దాస్ పాల్గొనగా కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్ పనుల ప్రగతి వివరించారు.